Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10

సోమవారం, జూలై 21, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## 22న అపాచీ హెలికాప్టర్ల రాక



న్యూఢిల్లీ: భారత సైన్యం అమ్ములపొదిలోకి అమెరికాకు చెందిన అత్యాధునిక అపాచీ ఏహెచ్-64ఈ అటాక్ హెలికాప్టర్లు చేరనున్నాయి. ఈ నెల 22న అవి సైన్యానికి అందబోతున్నాయి. ఈ ప్రక్రియ ఇప్పటికే 15 నెలలు ఆలస్యమైంది. మొదటి దశ హెలికాప్టర్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు అధికారులు చెప్పారు. మొదట మూడు హెలికాప్టర్లను మంగళవారం ఇండియన్ ఆర్మీ కి చెందిన ఏవియేషన్ విభాగానికి అప్పగించబోతున్నారు.



## తల్లీ బైలెల్లినాదో..!
## బోనమెత్తిన భాగ్యనగరం

- హైదరాబాద్‌లో వైభవంగా బోనాల వేడుకలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- 2,783 ఆలయాల్లో బోనాలకు 20కోట్లు: భట్టి

శివసత్తుల ఊరేగింపులు, పోతరాజుల విన్యాసాలు, తీన్మార్ దప్పులతో స్టెప్పులు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, జానపద గీతాలు.. ఎటు చూసినా భక్త జనసందోహం, సందడే సందడి... వెరసి భాగ్యనగరం ఆదివారం ఆషాడ బోనల జాతర శోభ సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ హైదరాబాద్ నగర వీధులన్నీ

2లో

## 23 నుంచి మోదీ విదేశాల పర్యటన



న్యూఢిల్లీ,: ప్రధాని మోదీ బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరనుంది. ముందుగా ఈనెల 23, 24 తేదీల్లో ప్రధాని యూకేలో పర్యటిస్తారు. అక్కడ బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో విస్తృతస్థాయి చర్చలు జరుపుతారు. ఈ సందర్భంగా భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. యూకే పర్యటన తర్వాత మోదీ మాల్దీవులకు వెళ్తారు. అక్కడ 26న జరిగే 60వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు 2023లో అధికారంలోకి వచ్చాక మోదీ అక్కడికి వెళ్లడం ఇదే మొదటిసారి. గతేడాది మోదీపై, లక్షదీవులపై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో పాటు, చైనా అనుకూల వైఖరి వల్ల ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

# డీలిమిటేషన్‌పై బీజేపీని నమ్మలేం



- జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించింది దక్షిణాది రాష్ట్రాలే
- నియోజకవర్గాల పునర్విభజనలో ఆ రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- మందబలం చూసుకుని బీజేపీ ఏమైనా చేస్తామంటే కుదరదు
- జైపూర్ టాక్ జర్నలిజం 9వ ఎడిషన్ చర్చలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్: ఉత్తర భారతదేశంలోని ఎంపీల సంఖ్యపై ఆధారపడి ఏర్పడే కేంద్ర ప్రభుత్వం.. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి ఒక్క రాష్ట్రం ఎంపీలే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదని తెలిపారు. జైపూర్‌లో జరుగుతున్న 'టాక్ జర్నలిజం'9వ ఎడిషన్ చర్చా కార్యక్రమంలో కేటీఆర్ ఆదివారం మాట్లాడారు. జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజనలో తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. డీలిమిటేషన్‌లో దక్షిణాదికి అన్యాయం జరగనివ్వబోమని బీజేపీ ప్రభుత్వం చెబుతున్న మాటలను నమ్మలేమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే స్థానాలు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పెంచలేదని గుర్తుచేశారు. అడగకముందే వారి రాజకీయ ప్రయోజనాల కోసం జమ్మూకశ్మీర్, అస్సాంలో మాత్రం అసెంబ్లీ సీట్లను పెంచారని మండిపడ్డారు. మంద బలం, అధికారం ఉందన్న అహంకారంతో జాతీయ భాషగా హిందీని బలవంతంగా రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీ లన్నీ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయని తెలిపారు. 'దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. తనకు ఇష్టం వచ్చిన పనులు చేస్తానని బీజేపీ అనుకుంటే.. ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఆ పార్టీ నే బాధ్యత వహించాల్సి ఉంటుంది'అని స్పష్టంచేశారు.

- మిగతా 2వ పేజీలో



## వరంగల్‌లో తెలంగాణ క్రీడాపాఠశాల

- వెంటనే విధివిధానాలు రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు
- రేవంత్‌రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు

హైదరాబాద్: వరంగల్‌లో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించి.. అందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శితో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం కడియం శ్రీహరి నేతృత్వంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. ఈ బృందంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజులు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ చాలాసేపు మాట్లాడారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క స్టేడియం మాత్రమే ఉందని, జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడల నిర్వహణకు ఉపయోగపడుతోందని, శిక్షణ కోసం కూడా ఉపయోగిస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సీఎంకు వివరించారు. వరంగల్ అన్ని వైపులా విస్తరిస్తున్న నేపథ్యంలో జనాభా పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా క్రీడా సేవల విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అవసరాలను తీర్చలేకపోతోందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ క్రీడా పాఠశాలను మంజూరు చేయడం ద్వారా ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించొచ్చని, ఈ పాఠశాలు ఏర్పాటుకు అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో అందుబాటులో ఉందన్నారు.

- మిగతా 2వ పేజీలో

## ఇది ప్రతీకార చర్య...

- మిథున్ రెడ్డి అరెస్ట్ పై జగన్ స్పందన
- ఏపీ లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి అరెస్ట్
- రాజకీయ కుట్రగా అభివర్ణించిన జగన్
- ప్రజలకు అండగా నిలిచేవారిని అణచివేస్తున్నారని ఆగ్రహం



2లో



## తుది నివేదిక వచ్చేవరకు ఓపిక పట్టాలని హితవు

- జూన్ 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం
- పాశ్చాత్యదేశాల మీడియాలో ఇష్టం వచ్చినట్టు కథనాలు ఇస్తున్నారన్న రామ్మోహన్ నాయుడు

ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదంపై దర్యాప్తు గురించి పాశ్చాత్య దేశాల మీడియా వివాదాస్పద, ఊహాగానాలతో కూడిన కవరేజీని ఇస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై తుది నివేదిక వెలువడే వరకు

- మిగతా 2వ పేజీలో



2లో

# 1 వరకు రిమాండ్

- రాజమహేంద్రవరం జైలుకు తరలింపు..
- ఇరు పక్షాల తరఫున జోరుగా వాదనలు..
- రిమాండ్‌పై అభ్యంతరం చెప్పని ఎంపీ
- కోర్టు ప్రాంగణం వద్ద వైసీపీ నేతల యాగీ

2లో

# తల్లీ బైలెల్లినాదో..! బోనమెత్తిన భాగ్యనగరం

(మొదటి పేజీ తరువాయి)

బోనాల ఉత్సవాలతో సందడిగా కనిపించాయి. హైదరాబాద్‌లో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవార్లకు బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అయితే, ప్రధాన ఆలయాల వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. లాల్‌దర్వాజాలోని సింహవాహని ఆలయం, హరిబౌలి అక్కన్నమాదన్న మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి, గౌలిపురా కోటమైసమ్మ, బేలాచందూలాల్ ముత్యాలమ్మ, మీర్‌ఆలంమండి మహంకాళి, కార్వాన్‌దర్బార్ మైసమ్మ, ఎల్‌బీనగర్ ఖిల్లామైసమ్మ తదితర ఆలయాల్లో అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పించింది. లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అక్కన్నమాదన్న ఆలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, గౌలిపురాలో మంత్రి వాకిటి శ్రీహరి, మీర్‌ఆలంమండి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎల్‌బీనగర్‌లోని ఖిల్లామైసమ్మ ఆలయంలో మంత్రి సీతక్క, ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాలిబండ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రభుత్వం తరఫున మేయర్ విజయలక్ష్మిపట్టువస్త్రాలు సమర్పించారు. ాల్‌దర్వాజాలో పట్టువస్త్రాల సమర్పణ అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.1290 కోట్లు వ్యయం చేస్తోందని తెలిపారు. రాజధానిలోని 2,783ఆలయాల్లో బోనాల నిర్వహణకు రూ.20కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. కాగా, లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ చామల కిరణ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, డిప్యూటి స్పీకర్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, బీజేపీ నేత లక్ష్మణ్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. బోరబండలోని శ్రీపోచమ్మ ఆలయంలోని అమ్మవారికి సినీనటి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి బంగారు బోనం సమర్పించగా.. మంత్రులు తుమ్మల, పొన్నం పట్టువస్త్రాలు సమర్పించారు. హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ నివాసంలో జరిగిన బోనాల వేడుకల్లోగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

**గవర్నర్, సీఎం శుభాకాంక్షలు**

బోనాల పండుగ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం రేవంత్ వేర్వేరుగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణతోపాటు దేశ ప్రజలందరికీ శాంతి, ఆరోగ్యం, శ్రేయస్సు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్టు గవర్నర్ తెలిపారు. ఇక, జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో మొదలైన ఉత్సవాలు లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి బోనం సమర్పించడంతో ముగుస్తాయని పేర్కొన్న సీఎం.. ఉత్సవాలు విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.






## డీలిమిటేషన్‌పై బీజేపీని నమ్మలేం

(మొదటి పేజీ తరువాయి)

బిహార్ ఓటర్ సర్వేపై అనుమానాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో అర్హత కలిగిన ఏ ఒక్క వ్యక్తి కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదని కేటీఆర్ అన్నారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల సవరణ మొదటిసారి కానప్పటికీ దానిపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయని, కేంద్ర ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బిహార్ పరిణామాలపై తమకు చాలా అభ్యంతరాలు ఉన్నాయని, దేశంలోని మిగతా రాష్ట్రాలపై దీని ప్రభావం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజల మధ్య విభేదాలు, విద్వేషాలు సృష్టించడం చాలా సులభమని అన్నారు. బిహార్ పరిణామాలు ప్రజలను విడగొట్టే రాజకీయ కుట్రలో భాగమేనని అనుమానం వ్యక్తంచేశారు. ఎన్నికల తరువాత ఫలితాలపై మాట్లాడటం కంటే ముందే ఇలాంటి విషయాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. బిహార్‌లో 5 లక్షల మంది ఓట్లు గల్లంతు కావటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. గత ఎన్నికల్లో కేవలం 12,500 ఓట్ల తేడాతో అక్కడ ఆర్జేడీ అధికారాన్ని కోల్పోయిందని గుర్తుచేశారు. ముందు దేశం.. ఆ తర్వాతే ప్రాంతం, మతం, కులం అని స్పష్టంచేశారు.

## ఇది ప్రతీకార చర్య...

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టును రాజకీయ కుట్రగా, ప్రజలకు అండగా నిలిచే వారిని అణచివేయడానికి టీడీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రతీకార చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక పోస్ట్ ద్వారా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "మిథున్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గం నుండి వరుసగా మూడు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన నాయకుడు. ఆయనను శనివారం రాత్రి విజయవాడలో సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఈ అరెస్టు 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణం ఆరోపణలతో ముడిపడి ఉంది. అయితే, ఈ కేసు పూర్తిగా కల్పితం, బెదిరింపులు, ఒత్తిడి, థర్డ్ డిగ్రీ టార్చర్, లంచాల ద్వారా రాబట్టిన బలవంతపు వాంగ్మూలాలపై ఆధారపడిన కేసు" అని జగన్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2014-2019 మధ్య ఆయన పాలనలో జరిగిన అవినీతి కేసుల్లో బెయిల్‌పై ఉన్నారని, తన సొంత కుంభకోణాలను కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్నారని విమర్శించారు. "చంద్రబాబు రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రభుత్వ ఏజెన్సీలను, పచ్చ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారు. 2014-19లో ప్రైవేట్ మద్యం సిండికేట్లు వృద్ధి చెందాయి, అవినీతి సంస్థాగతీకరించారు. ఇప్పుడు తనపై ఉన్న కేసులను రద్దు చేసుకోవడానికి, 2024-29 కాలానికి తన మద్యం విధానాన్ని సమర్థించుకోవడానికి వైసీపీ విధానంలో తప్పులు వెతుకుతున్నారు" అని ఆయన ఆరోపించారు. "టీడీపీ అసలు అజెండా ఇప్పుడు స్పష్టంగా ఉంది. వారు సిట్ ను ఉపయోగించి వైసీపీ నాయకులను విచారణ పేరుతో అరెస్టు చేసి, వారిని నిరవధికంగా జైలులో ఉంచడానికి న్యాయ ప్రక్రియను సాగదీయాలని కోరుకుంటున్నారు. వైసీపీని అణచివేయడానికి ఇటువంటి కుట్రలు జరిగిన ప్రతిసారీ, మేము ధైర్యంగా పోరాడాం. ప్రజలకు అండగా నిలబడి, వారికి గొంతుక ఇవ్వడం ద్వారానే మేము ఎదిగాం. అన్యాయాన్ని నేరుగా ఎదుర్కోవడం ద్వారానే వైసీపీ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. టీడీపీ అధికార దుర్వినియోగం ప్రజాస్వామ్యంపై జరిగిన నేరం తప్ప మరొకటి కాదు. ఎన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ, వైసీపీ ప్రజలకు అండగా నిలబడుతుంది, వారి గళం మరియు వారి రక్షణగా ఉంటుంది... ఇప్పుడు మరియు ఎల్లప్పుడూ..." అంటూ జగన్ ట్వీట్ చేశారు.



## తుది నివేదిక వచ్చేవరకు ఓపిక పట్టాలని హితవు

(మొదటి పేజీ తరువాయి)

ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 260 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనపై భారత విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) నిర్వహిస్తున్న దర్యాప్తులో బ్లాక్ బాక్స్ డేటాను విజయవంతంగా డీకోడ్ చేసినందుకు మంత్రి నాయుడు ఏఏఐబీని ప్రశంసించారు. "గతంలో బ్లాక్ బాక్స్ దెబ్బతిన్న సందర్భాల్లో డేటాను పొందేందుకు విదేశాలకు పంపేవారు. కానీ ఈసారి ఏఏఐబీ భారతదేశంలోనే దీన్ని సాధించడం గొప్ప విజయం" అని ఆయన అన్నారు. ప్రాథమిక నివేదిక కూడా సిద్ధమైందని, అయితే తుది నివేదిక వచ్చే వరకు ఎటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల మీడియా, ముఖ్యంగా వాల్ స్ట్రీట్ జర్నల్ మరియు రాయిటర్స్ వంటి సంస్థలు, పైలట్లపై నిందలు వేస్తూ, ఆధారాలు లేని కథనాలను ప్రచురిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. "ఏఏఐబీ అందరినీ, ముఖ్యంగా విదేశీ మీడియా సంస్థలను, వాటి స్వప్రయోజనాల కోసం ఇలాంటి కథనాలు ప్రచురించకుండా ఉండాలని కోరింది" అని ఆయన చెప్పారు. అమెరికా జాతీయ రవాణా భద్రతా మండలి (ఎన్టీఎస్బీ) చైర్‌పర్సన్ జెన్నిఫర్ హొమెండీ కూడా ఈ కథనాలను అకాల, ఊహాగానాలతో కూడినవిగా విమర్శించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోందని, ఎన్టీఎస్బీ భారత దర్యాప్తు సంస్థకు సహకరిస్తుందని ఆమె తెలిపారు. ఏఏఐబీ జూలై 17న జారీ చేసిన ఒక ప్రకటనలో, కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు ధృవీకరించని కవరేజీని ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాను ఓపికగా ఉండాలని, తుది నివేదిక కోసం వేచి ఉండాలని కోరారు. "అందరూ జాగ్రత్తగా ఉండాలి. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఊహాగానాలు చేయడం సరికాదు" అని ఆయన అన్నారు.

## పోడు భూముల రగడ..




ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో పోడు గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. పోడు భూము ల్లో అటవీశాఖ మొక్కలు నాటడాన్ని ముల్తానీలు వ్యతిరేకించారు. కేశవపట్నం, సడక్‌గూడ గ్రామాల మధ్యలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. మహిళలు, పురుషులు, పిల్లలు దాదాపు 200 మంది వరకు రాళ్లు కర్రలతో మూకుమ్మడిగా దాడికి దిగారు. ఈ ఘటనలో ఇచ్చోడ ఎస్సై పురుషోత్తంతో పాటు నలుగురు సిబ్బంది గాయపడ్డారు. వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. నాలుగు రోజులుగా సిరిచెల్మ అటవీ ప్రాంతంలోని చెలుకగూడ వద్ద ముల్తానీలు సాగు చేస్తున్న పోడు భూముల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నారు. ఆదివారం కూడా సిబ్బందితో కలిసి బందోబస్తు మధ్య అక్కడికి చేరుకున్నారు. మరికొంతమంది అటవీ సిబ్బంది, పోలీసులు సిరిచెల్మ ఘాట్‌పై సడక్‌గూడ వద్ద వేచి ఉన్నారు. ఈక్రమంలో కేశవపట్నం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భర్త అల్తాఫ్ స్థానిక ఎస్సై పురుషోత్తంకు ఫోన్ చేసి గ్రామస్తులతో మాట్లాడదామని పిలిచారు. దీంతో ఎస్సై ఇద్దరు సిబ్బందితో కలిసి కేశవపట్నం వైపు వెళ్లారు. అప్పటికే గ్రామస్తులు గాయిద్‌పల్లి రోడ్డు వద్ద వేచి ఉన్నారు. వాహనంలో నుంచి దిగిన ఎస్సై, సిబ్బందిని ముల్తానీలు చుట్టుముట్టి దాడికి పాల్పడ్డారు. ఎస్సై చేతికి గాయమవగా.. వీడియో తీస్తున్న కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను లాక్కొని రాయితో తలపై కొట్టారు. పోలీసు వాహనంపై రాళ్లు వేయడంతో అద్దాలు పగిలిపోయాయి. అప్రమత్తమైన ఎస్సై మిగతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునేలోపు ముల్తానీలు పరారయ్యారు. 20 నిమిషాల తర్వాత పొలాల వైపు నుంచి వచ్చిన ముల్తానీలు సిబ్బందిపై మరోసారి రాళ్లతో దాడికి దిగారు.

## 1 వరకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ: మద్యం కుంభకోణం కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి. భాస్కరరావు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. శనివారం సిట్ విచారణకు వచ్చిన మిథున్‌రెడ్డిని అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్(సిట్) తరపున ఇ. కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, మిథున్‌రెడ్డి తరపున హైకోర్టు సీనియర్ న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. న్యాయాధికారి బెంచ్ మీదకు వచ్చిన వెంటనే మిథున్‌రెడ్డిని కోర్టు హాలులోకి పిలిచారు. న్యాయాధికారి భాస్కరరావు తొలుత మిథున్‌రెడ్డిని పేరు అడిగారు. అనంతరం, నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. "రిమాండ్‌పై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మిథున్‌రెడ్డి మూడు సార్లు ఎంపీగా గెలిచారు. ప్రోటెం స్పీకర్‌గా కూడా పనిచేశారు. ఆయనకు 'వై' కేటగిరి భద్రత ఉంది." అని చెప్పారు. దీనిపై న్యాయాధికారి.. మిథున్‌రెడ్డిని ప్రశ్నించగా.. తనకు ఎనిమిది మంది గన్‌మన్లతో కూడిన 'వై' కేటగిరి భద్రత ఉందని వివరించారు. మిథున్‌పై నమోదు చేసిన సెక్షన్లలో ఐపీసీ 409 వర్తించబోదని న్యాయవాది నాగార్జునరెడ్డి వాదించారు. వైద్య పరీక్షల నివేదికలో ఈసీజీకి సంబంధించి వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ఈ విషయంపైనా మరోసారి మిథున్‌రెడ్డిని న్యాయాధికారి ప్రశ్నించారు. ఈసీజీలో రెండుసార్లు హెచ్చుతగ్గులు వచ్చాయని మిథున్‌రెడ్డి తెలిపారు. తర్వాత ఎకో-2డీ పరీక్షలు చేశారన్నారు. దీనికి సంబంధించి ఇంతకుముందున్న సమస్యను మిథున్‌రెడ్డి వివరించారు. ఆ రిపోర్టులను న్యాయాధికారికి ఇచ్చారు. దీనిపై సిట్ తరఫున పోసాని వెంకటేశ్వర్లు



వాదనలు వినిపించారు. ఇంతకుముందు వైద్య నివేదికలు ఎలా ఉన్నా ప్రభుత్వాసుపత్రి వైద్యుల నివేదిక మాత్రం రిమాండ్‌కు అనుకూలమేనని ఉందని వివరించారు. మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి నేరం చేసినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయన్నారు. ఆయన దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్లను హైకోర్టు, సుప్రీం కోర్టు కొట్టేశాయని వివరించారు. ఎంపీ మిథున్‌రెడ్డిని జైలుకు పంపే విషయంపై న్యాయాధికారి భాస్కరరావు.. నేరుగా ఆయననే అభిప్రాయం కోరారు. తనకు గుంటూరు, నెల్లూరు జైళ్లలో ఏదైనా ఫర్వాలేదని మిథున్ సమాధానం ఇచ్చారు. సిట్ తరఫు న్యాయవాది పోసాని స్పందిస్తూ.. మిథున్‌రెడ్డి ప్రజాప్రతినిధిగా ఉన్నారు కాబట్టి జైళ్ల శాఖ నిబంధనలు ఎలా ఉంటే అలా అధికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. మిథున్‌రెడ్డికి ఇంటి భోజనం అనుమతించాలని, ఐదు ములాఖత్‌లు ఇవ్వాలని, వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. వాటిపై పిటిషన్లు దాఖలు చేసుకోవాలని పోసాని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి భాస్కరరావు తీర్పును వెలువరించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు.



## వరంగల్‌లో తెలంగాణ క్రీడాపాఠశాల

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్‌కు చెందిన విద్యార్థులు క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో క్రికెట్ కోసం ప్రత్యేక స్టేడియం ఏర్పాటు చేయాలని కూడా కోరారు. క్రీడా పాఠశాలతోపాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియాన్ని వీలున్నంత త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా పాఠశాలతో పాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటుతో పాటు జిల్లా అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, మంత్రి కొండా సురేఖ దంపతులకు విభేదాలు వచ్చిన నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల సీఎం రేవంత్ మంత్రి సురేఖ, ఆమె కుమార్తె సుస్మితా పటేల్‌తో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఇప్పుడు ఆమెను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలతో భేటీ కావడంతో ఈ సమావేశంలో రాజకీయంగా ఏం చర్చ జరిగిందన్నది ఆసక్తి నెలకొంది. ఇరుపక్షాలకు సర్దిచెప్పేందుకే రేవంత్ విడివిడిగా ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమయ్యారని, వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలను కొంతకాలం పక్కనపెట్టేలా ఈ భేటీలో చర్చలు జరిగాయని తెలుస్తోంది.

# భూ బకాసురుడిగా ప్రభుత్వ ఉద్యోగి

## వెలుగులోకి వస్తున్న అక్రమార్కుడి బాగోతాలు



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జులై 20 : (జడ్చర్ల )నవాబు పేట మండల తహసిల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన కొందరు అవినీతి అధికారుల అండదండలు పుష్కలంగా కలిగి ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగి పాలమూరి భీమయ్య ( ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ కళాశాలలో అటెండర్) వారి సహకారంతో తన సొంత గ్రామమైన మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన అమాయకుల భూములను అక్రమంగా తన పేరుపై, తన కుటుంబ సభ్యుల పేరుపై రిజిస్ట్రేషన్లు చేయించుకుని భూ బకాసురుడిగా మారాడు.గతంలో గ్రామ విఆర్ఏగా పనిచేసిన భీమయ్య ఆ సమయంలో మండలంలో పనిచేసిన ఓ అవినీతి అధికారి సహకారంతో ధరణి లోని లోపాలను ఆసరాగా చేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డాడు. కొన్ని రోజుల క్రితం ఆయన బాగోతాన్ని గ్రామానికి చెందిన పాలమూరి జంగమ్మ బయటపెట్టగా తాజాగా శనివారం గ్రామానికి చెందిన దివిటిపల్లి రాములమ్మ బయటపెట్టింది. 13 సంవత్సరాల క్రితం తన భర్త రాజయ్య చనిపోగా ఆయన పేరు పై ఉన్న భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించడంలో సహకరించాల్సిందిగా విఆర్ఏ గా విధులు నిర్వహిస్తున్న భీమయ్యను రాములమ్మ కోరగా ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న ఆయన ఆమె పేరుపై రిజిస్ట్రేషన్ చేయకుండా తన కూతురు గొల్ల సరోజ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం ఆలస్యంగా తెలుసుకున్న రాములమ్మ తన భూమి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలని కోరగా అందుకు ససేమిరా అన్న భీమయ్య భూమి ఆమె పేరున రిజిస్ట్రేషన్ చేయకపోగా, ఆ భూమి తనదేనని భూమి రిజిస్ట్రేషన్ చేయమని కోరితే అంతు చూస్తానని హెచ్చరించారు. దాంతో ఆయన బెదిరింపులకు భయపడిన రాములమ్మ శనివారం ఎస్సై విక్రమ్ ను ఆశ్రయించి భీమయ్య నుండి తనకు ప్రాణ హాని ఉన్నదని, అందువల్ల ఆయన నుండి తనకు రక్షణ కల్పించడంతో పాటు తన భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన భూభాగోతం మరోసారి బయటపడింది. అంతేకాక ఆయన గ్రామంలోని మరికొందరి భూములను కూడా ఇదే విధంగా స్వాహా చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్,తహసిల్దార్ లు సమగ్ర విచారణ జరిపితే భీమయ్య చేసిన మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన స్వగ్రామమైన కొండాపూర్ గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఇలాంటి అక్రమాలకు పాల్పడిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవడం విషయంలో రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ లక్ష్మి నగర్ కాలనీ ముఖద్వారం ప్రారంభోత్సవం!

### ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన
### బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్





వాయిస్ టుడే న్యూస్,జులై 20 బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని చెంగిచెర్ల శ్రీ లక్ష్మి నగర్ కాలనీ ముఖద్వార ప్రారంభోత్సవ కార్యక్రమనికి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్, సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శ్రీ లక్ష్మి నగర్ కాలనీ అధ్యక్షులు నర్సింహా చారి,కాలనీ కమిటీ సభ్యులు కాలనీవాసులతో కలసి శ్రీ లక్ష్మి నగర్ కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో సిసి రోడ్డు, డ్రైనేజీ సమస్యలను రవి గౌడ్ దృష్టికి తీసుకుపోగా త్వరలోనే కాలనీలో సిసి రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గట్టోజీ నరసింహ చారి, వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వెంకటయ్య, ట్రెజరర్ సందీప్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రాములు, కమలాకర్ రెడ్డి, కాలనీ సభ్యులు గణేష్, సహదేవ్, శ్రీనివాస్, చందు, రాజు, కిరణ్ కుమార్, వెంకట్ రెడ్డి, సాయి, నవీన్, కరుణాకర్, రాఘవేంద్రరావు, కనకయ్య, రామకోటేశ్వరరావు, నవీన్ కుమార్, మరియు 2వ డివిజన్ నాయకులు, కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల విద్య కోసం ఏ ఫండ్ బెటర్?



**రాజేశ్.. మ్యూచువల్ ఫండ్స్‌కు కొత్త. తన కుమారుడి ఉన్నత విద్య కోసం రాబోయే 12 ఏండ్లపాటు నెలకు రూ.5వేల చొప్పున పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు. అయితే ఏ మ్యూచువల్ ఫండ్ స్కీంను ఎంచుకోవాలో తెలియక సతమతమవుతున్నాడు. ఈ అయోమయం ఒక్క రాజేశ్‌కే కాదు.. విద్య, సొంతిల్లు, రిటైర్మెంట్ ఫండ్ తదితర లక్ష్యాల సాధన కోసం పెట్టుబడి మార్గాలను అన్వేషిస్తున్న ఇంకా ఎందరిదో. మరి మార్కెట్, ఆర్థిక నిపుణులు ఏం చెప్తున్నారో చూద్దాం.**

**ఇది గుర్తుంచుకోండి**

ముందుగా మీ పిల్లలను ఏం చదివించాలనుకుంటున్నారో.. దానికి ప్రస్తుతం అవుతున్న ఖర్చెంతో తెలుసుకోవాలి. ఆ మొత్తానికి 6 నుంచి 8 శాతం చొప్పున వార్షిక ద్రవ్యోల్బణం కలపాలి. పన్నులు ఇతరత్రా వ్యయాలనూ లెక్కించి ముందుకెళ్తే మరీ మంచిది. ఉదాహరణకు మీరు కోరుకుంటున్న కోర్సుకు ఇప్పుడు రూ.10 లక్షలు అవుతుందని అనుకుందాం. దీనికి 6 శాతం వార్షిక ద్రవ్యోల్బణాన్ని 12 ఏండ్లకు జోడిస్తే సుమారు రూ.20.12 లక్షలు అవుతుంది. కాబట్టి ఈ మొత్తం కోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) కింద 12 ఏండ్లు ప్రతి నెలా పెట్టుబడిగా మీరు రూ.6,244 పెడితే సహజంగా అందే 12 శాతం ప్రతిఫలంతో ఆశించిన నగదును సమకూర్చుకోవచ్చు. మీరు పెట్టే పెట్టుబడి రూ.8,99,136. రాబడి రూ.11,13,006.58. మొత్తం రూ.20,12,142.58 పొందవచ్చు. ఈ రకమైన రాబడులను అందించే మ్యూచువల్ ఫండ్స్ స్కీములు మార్కెట్‌లో ప్రస్తుతం చాలానే ఉన్నాయి. అనేక బ్యాంకులు, ఇతరత్రా సంస్థలూ వాటిని అందిస్తున్నాయి. ఒక్కసారి పరిశీలించి, మీకు అనువైన నిర్ణయం తీసుకోవచ్చు. అయితే మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ ఒడిదుడుకులకు లోబడి ఉంటాయి. కాబట్టి మీ రిస్క్ ప్రొఫైల్‌నుబట్టి ఓ నిర్ణయం తీసుకోవడం ఉత్తమం. ఇందుకు మార్కెట్ ఎక్స్‌పర్ట్స్, మ్యూచువల్ ఫండ్ సలహాదారులను సంప్రదించడం చాలా మంచిది. తద్వారా మరింత మెరుగైన ఫలితాలను అందుకోవచ్చు. కాగా, కన్జర్వేటివ్ రిస్క్ ప్రొఫైలైతే లార్జ్ క్యాప్ ఫండ్స్‌ను, మాడరేట్ రిస్క్ ప్రొఫైలైతే మల్టీ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవడం మేలని మార్కెట్ పండితులు సూచిస్తున్నారు.

# బుల్‌ట్రెండ్‌లోనే మార్కెట్

వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలతో యూఎస్ ఫెడ్ మరింత బలాన్ని ఇవ్వడంతో నెలరోజులుగా జరుగుతున్న మార్కెట్ ర్యాలీ మరింత స్పీడందుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ-50 ఇండెక్స్ గతవారంలో 488 పాయింట్లు పెరిగి ఆల్‌టైమ్ రికార్డుస్థాయి 21,457 పాయింట్ల వద్ద నిలిచి, వరుసగా ఏడో వారంలో సైతం లాభాలతో ముగిసింది. ఈ వారంలో కూడా బుల్‌ట్రెండ్ కొనసాగుతుందన్న అంచనాల్ని మెజారిటీ టెక్నికల్ అనలిస్టులు వెల్లడించారు. గ్యాప్ అప్ ఓపెనింగ్‌లతోపాటు ఇంట్రాడే ఒడిదుడుకులు తక్కువగా ఉండటం బుల్‌ట్రెండ్ పటిష్ఠతను సూచిస్తున్నదని సామ్కో వెంచర్స్ సీఈవో జిమిత్ మోదీ తెలిపారు. దాదాపు అన్ని రంగాల షేర్లూ ర్యాలీలో పాలుపంచుకోవడం, ముఖ్యంగా ఐటీ, కొన్ని బ్యాంకింగ్ దిగ్గజాలు వేగంగా పెరగడం మరింత అప్‌ట్రెండ్‌కు సంకేతమని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా చెప్పారు. ర్యాలీని మిస్ అయ్యామన్న ఇన్వెస్టర్ల భావన, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో మార్కెట్లో మూమెంటం కొనసాగుతుందని యాక్సిస్ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ రాజేశ్ పాల్వియా అంచనా వేశారు. మార్కెట్ తగ్గుదల కొనుగోళ్లకు అవకాశమని ట్రేడర్లు, ఇన్వెసర్లకు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్, డెరివేటివ్ అనలిస్ట్ కునాల్ షా సూచించారు. ఆప్షన్ రైటింగ్ యాక్టివిటీ ప్రకారం ఈ వారం నిఫ్టీకి 21250-21,300 శ్రేణి తక్షణ మద్దతు అందించవచ్చని, 21,500-21,600 పాయింట్ల శ్రేణి వరకూ పెరగవచ్చని రాజేశ్ పాల్వియా విశ్లేషించారు. ఈ శ్రేణిని దాటితే 21,800 వరకూ ర్యాలీ జరిగే ఛాన్స్ ఉంటుందన్నారు. పటిష్ఠమైన మూమెంటం నిఫ్టీని 21,700-22,000 పాయింట్ల స్థాయికి నడిపిస్తుందని కునాల్ షా అంచనా వేశారు. స్వల్పకాలిక కరెక్షన్లను క్వాలిటీ షేర్ల కొనుగోలుకు ఉపయోగించుకోవాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అనలిస్ట్ సుభాష్ గంగాధరన్ సూచిస్తూ సమీప భవిష్యత్‌లో మరింత పెరుగుదలను మార్కెట్ టెక్నికల్స్ వెల్లడిస్తున్నాయని వివరించారు.

## జగిత్యాల్ డి.సి.పి.ఓ హరీష్ వేధింపులు తట్టుకోలేక మహిళ ఉద్యోగి సెల్ఫీ వీడియో..



జగిత్యాల్.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.20 జూలై : జగిత్యాల్ జిల్లా కేంద్రంలో సంచలనంగా మారిన ఉద్యోగి సెల్ఫీ వీడియో తనకు భర్త లేడు అని ఇష్టామచినట్లు మాట్లాడుతూ.. మానసం కంగా, వ్యక్తిగత కారణాలతో సూటి పోటీ మాటలు అంటూ వేధిస్తున్నాడని జిల్లా బాలల సంరక్షణ శాఖ విభాగంలో అవుట్ రీచ్ వర్కర్ శ్రీవాణి గత కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతూ డిసిపిఓ హరీష్ పై ఫిర్యాదు చేసినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో జిల్లా కలెక్టర్ కు మరియు మంత్రి అడ్లురి లక్ష్మణ్ కు ఫిర్యాదు చేసినప్పటికీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని రోజు రోజుకు తోటి ఉద్యోగి అని చూడకుండా అందరి ముందట ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ నోటికి వచ్చినట్లు దూషిస్తున్నాడని ఒక మహిళ ఉద్యోగి భర్త కోల్పోయిన నన్ను ఇలా వేధించడంతో గత కొన్ని నెలలుగా టీఏ,డీఏ విషయంలో కూడా అవమానంగా మాట్లాడుతూ నన్ను ఎవరు ఏమి చేయలేరు. ఎవరికి చెబుతావో చెప్పుకో అంటూ అనడంతో చివరికి ఎవరి దగ్గరికి వెళ్ళినా ఫలితం ఉండదని గ్రహించి సెల్ఫీ వీడియో ద్వారా తన సమస్యను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో జగిత్యాల్ జిల్లాలో ఈ పోస్టు సంచలనంగా మారింది. ఒక మహిళ ఉద్యోగి తనకు మగతోడు లేదని ఎలాంటి అండదండలు లేని ఇలాంటి మహిళలకు అన్యాయం జరుగుతుంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోక పోవడం తో జగిత్యాల్ ప్రజలు తప్పుపడుతున్నారు.



## కాలనీ అభివృద్ధి కోసం పని చేస్తా!

### దేవేందర్ నగర్ పేజ్ 2 అధ్యక్షుడిగా చిన్నం గణేష్
### కార్పొరేటర్ల పాలన ముగిసిపోవడంతో
### రసవత్తరంగా మారిన కాలనీ అధ్యక్ష ఎన్నికలు.
### ఇంచార్జ్ జన్నె రాజు సాకారంతో గెలుపు.

వాయిస్ టుడే న్యూస్, జూలై 20 బోడుప్పల్ : బోడుప్పల్ కార్పొరేషన్ 13వ డివిజన్ దేవేందర్ నగర్ ఫేజ్ 2 కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చిన్నం గణేష్ విజయం సాధించాడు. అదివారం కాలనీ అసోసియేషన్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటి పడగా చిన్నం గణేష్ కు 220 ఓట్లు రాగ సమీప ప్రత్యర్థి భగవంతం కు ఓట్లు 36 పోలాయ్యాయి,చెల్లని ఓట్లు పోలినట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు బైరుగొండ మల్లేష్, సీసాల సత్తయ్య,చల్లా నరసింహులు,రవి,సుధాకర్ లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం చిన్నం గణేష్ విజేతగా నిలిచినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, కాలనీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి దోహద పడిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పోగుల నరసింహ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ 13 వ డివిజన్ ఇంచార్జ్ జెన్న రాజు లకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.



### తెలంగాణ సాంస్కృతికి నిదర్శనం

## బోనాల పండుగ!

### పి.ఎం.సి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి

వాయిస్ టుడే న్యూస్, జులై 20 మేడిపల్లి : గ్రామ దేవతల విశిష్టత, స్త్రీ శక్తికి ప్రతిరూపంగా నిలిచే బోనాల ద్వారా అమ్మవార్లను పూజించడం తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు నిదర్శనమని, తెలంగాణ ఆషాడ బోనాల పండుగ సందర్భంగా ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనీ వివిధ అమ్మవారి బోనాల పూజల్లో ముఖ్య అతిధిగా తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి,మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 3న బీసీల రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



సికింద్రాబాద్, జూలై 20 (వాయిస్ టుడే ప్రతినిధి): స్థానిక సంస్థల లో 42 శాతం రిజర్వేషన్లు, కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన ను చేపట్టాలని నిర్ణయించిన అంశాలపై భవిష్యత్తు కార్యాచరణ కై చర్చించడానికి ఆగస్టు 3 న హైదరాబాద్లో రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి జిల్లా మండల రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు హాజరు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం విద్యానగర్లోని బీసీ భవన్ లో బీసీ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బీసీలకు 76 సంవత్సరాలుగా అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం 42 శాతం రిజర్వేషన్ల అమలు ప్రక్రియలో కొంతమంది కుట్రలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, స్థానిక సంస్థలు బీసీలకు వాటా ఇస్తుంటే ఓర్వలేకపోతున్నారని, ఇది అన్యాయమని అన్నారు. అన్ని రిజర్వేషన్లకు బిసి కులాల సహకరించాయని, బిసి కులాల రిజర్వేషన్లకు అందరూ సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య రాజ్యాంగబద్ధమైన వాటా తగ్గించుకోవాలంటే బీసీ లు అందరూ రిజర్వేషన్లు కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తర్వాత నరేంద్ర మోడీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జనాభా గణన లో కుల గణన చేపట్టాలని సాహసోపేతమైన చారిత్రక నిర్ణయం తీసుకుందని, 75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల డిమాండ్ ను కేంద్రం గౌరవించినట్లుగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంపై ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. కుల గణన తర్వాత బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ జనాభా ప్రకారం విద్య ఉద్యోగ రిజర్వేషన్లు పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని కృష్ణయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో 50% రిజర్వేషన్ పెట్టాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రెండు లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ప్రకటించాలనీ, బీసీల విద్య ఉద్యోగ రిజర్వేషన్లు 25% నుంచి 50% పెంచాలని, బీసీలకు బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలి, ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలనీ కొన్ని తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, సతీష్, సుధాకర్, మోడీ రాందేవ్, పృథ్వీరాజ్, బాలస్వామి, లింగయ్య యాదవ్, ఆశీష్ గౌడ్, నిఖిల్, మనోజ్ కుమార్ యాదవ్, బాలయ్య పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ

కుత్బుల్లాపూర్, జూలై 20( వాయిస్ టుడే) గ్రామంలోని మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో ప్రత్యేకంగా అలంకరించుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామ వీధులన్నీ బోనాల ఊరేగింపులతో మారుమ్రోగాయి. తాళం, డప్పులతో, పల్లకీతో అమ్మవారిని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువత, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని పండుగ వేడుకలకు మరింత వైభవం చేకూర్చారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ వేడుకలు గ్రామ ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి. గ్రామస్థుల సహకారంతో ఎంతో సాంప్రదాయబద్ధంగా, శ్రద్ధతో బోనాల ఉత్సవం నిర్వహించడాన్ని అందరూ ప్రశంసించారు.ద



## రాజశేఖర్ గంగాపుత్ర ఆషాఢ మాస బోనాల సందర్భంగా న్యూ ప్రేమనగర్ శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

హైదరాబాద్: జులై 20బీ( వాయిస్ టూ డే): తెలంగాణ బిసి విద్యార్థి యువజన విభాగం నాయకులు అంబర్పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ రాజశేఖర్ గంగాపుత్ర ఆషాఢ మాస బోనాల సందర్భంగా న్యూ ప్రేమనగర్ శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు గా ఉంది అని సహజంగా వచ్చే వర్షాలు కూడా అసజహంగ వస్తు సకాలంలో వర్షాలు పడకుండా విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురుచూపులు చూస్తూ అన్నమో రామచంద్ర అంటూ రైతు ఆకాశం వైపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నానని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు రాజశేఖర్ గంగపుత్రను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైలారం రాజు ప్రభాకర్ గౌడ్, రామాంజనేయులు భాస్కర్ గౌడ్, రాజనేత, విగ్నేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం డివిజన్లో ఘనంగా బోనాల ఉత్సవాలు

### బోనాల ఊరేగింపులో కుటుంబ సమేతంగా బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్..



నాచారం జూలై 20 (వాయిస్ టుడే): ఆషాడ బోనాల జాతర సందర్భంగా నాచారం డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకుని ఆ అమ్మవారి దివ్య కటాక్షములు అందుకుంటున్న బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పవిత్ర ఆషాడ మాసంలో ఆ అమ్మవారికి బోనాన్ని సమర్పించి చేసుకునే బోనాల పండగను అందరు భక్తి శ్రద్దలతో చేసుకోసుకుని ఆ అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందుకోవాలని కొరారు. ఆ అమ్మవారి దివ్య కృపాకటాక్షలు, దీవెనలు, ఆశీస్సులు నాచారం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలియచేసారు.



## మహంకాళి, శ్రీరామ మందిరంలో ఘనంగా బోనాల జాతర....

నాచారం, జూలై 20(వాయిస్ టుడే): ఆషాడ బోనాల జాతర ఆదివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. శ్రీ మహంకాళి, శ్రీరామ మందిరం వద్ద నిర్వహించిన బోనాల జాతరలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మ వాళ్లకు బోనాలను సమర్పించారు. భక్తులు శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. పోతరాజుల విన్యాసాలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతల బాబురావు, ధర్మకర్త లు మల్లాడి రామకాంత్ రెడ్డి సింగమనేని రఘు, మేకల అమరవాణి, విప్పిన్ కుమార్ అగర్వాల్, రామేశ్వరం ధర్మరాజు, గట్టు శ్రీనివాసాచార్యులు, గ్యార నర్సింగరావు , గ్యార మహేందర్, ఉదయ్ భాస్కర్, విజయ్ భాస్కర్, కిరణ్, సీహెచ్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



## వైభవోపేతంగా బీరప్ప బోనాలు

మేడ్చల్ ప్రతినిధి ( వాయిస్ టుడే ) జూలై 20 :ు ఆషాడ మాసం సందర్భంగా జవహర్ నగర్ బాలాజీ నగర్ కురుమ సంఘం అధ్యక్షులు ఆలేటి సిద్దేశ్వర్ కురుమ ఆధ్వర్యంలో బీరప్ప స్వామి బోనాల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిద్దేశ్వర కురుమ మాట్లాడుతూ బాలాజీ నగర్ కురుమ కుల బంధువులందరం బీరప్ప స్వామికి ఇష్టమైన పసుపు కుంకుమలతో అలంకరించిన బోనాలను దీపాల కాంతులతో డోల్ బాజాలతో శివసత్తుల ఆటపాటలతో ఊరేగింపుగా బీరప్ప దేవాలయం వద్దకు తీసుకువెళ్లి స్వామివారికి నైవేద్యాలు సమర్పించడం జరిగిందని అన్నారు అనంతరం కురుమ కుల బంధువుల కుటుంబ సభ్యులతో పాటు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతంలో ఉన్న ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్య సుఖశాంతులను ప్రసాదించాలని బీరప్ప స్వామిని వేడుకోవడం జరిగిందని తెలిపారు అదేవిధంగా జవహర్ నగర్ ప్రజలందరూ కూడా బీరప్ప స్వామి దేవాలయం వద్ద విచ్చేసి స్వామివారిని దర్శించుకుని బీరప్ప స్వామి కృప కటాక్షాలు పొందాలని సూచించారు



## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఆషాడ బోనాల ఉత్సవాలలో భాగంగా నేడు ఉప్పల్ నియోజకవర్గం చెర్లపల్లి డివిజన్ లోని కుషాయిగూడ పోచమ్మ ,నల్ల పోచమ్మ మరియు ముత్యాలమ్మ దేవాలయలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గోన్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగి రెడ్డి ధనపాల్ రెడ్డి, ,సీత రామ్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు సింగి రెడ్డి వెంకట్ రెడ్డి , మెర్పెట్ హెచ్ బి కాలనీ అధ్యక్షులు పోలెపాక అంజయ్య,ఏ ఎస్ రావు నగర్ అధ్యక్షులు కాశెట్టి ప్రసాద్,,శ్రీనివాస్ ముదిరాజ్,విఠల్ నాయక్,ఉదయ్,సురేష్,మల్లికార్జున్,సురేశ్ గౌడ్,జెమిని,లింగం,సుంకు శ్రీకాంత్ రెడ్డి,సునీత,బూపాల్ రెడ్డి,అజీజ్,నర్సింహ,సుజీత్ రెడ్డి,సాకెత్,చరణ్,డివిజన్ కాంగ్రెస్ కమిటీ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు పైన చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ పార్టీ నాయకులు

కుత్బుల్లాపూర్ జులై 20(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై, మాజీ ఎమ్మెల్యే %డ% మల్కాజ్గిరి నియోజకవర్గ ఇంచార్జి మైనంపల్లి హనుమంత్ రావు పై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ బహదూర్ పల్లి సాదు యాదవ్ పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా సాదు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ,ఎమ్.ఎల్.సి శంబీపూర్ రాజు మైనంపల్లి హనుమంత్ రావు ని అయన మోచేతి నీళ్లు తగిన మీరు ఆయనని అనేంత స్థాయి మీకు లేదు తెలంగాణ ఉద్యమం చేసినపుడు మీది ఎ స్థాయి మరి ఇప్పుడు మీదగ్గరా వేల కోట్ల ఎల? సంపాదించారు. అలాగే తెలంగాణ ఉద్యమ నాయకులకు మీరు చేసింది శూన్యం...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల వల్ల ఓర్వలేక లేని పోనీ ఆరోపణలు చేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులకు త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు తొందర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. మి ప్రభుత్వం 10 సంవత్సరాలు ప్రజలకు చేసింది శూన్యం. మా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు ,ఉచిత కరెంటు ,రైతు రుణమాఫీ , ఇందిరమ్మ ఇల్లు,పేద ప్రజలు కడుపు నిండా అన్నం తినాలి అనే సంకల్పంతో ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ఇవ్వడం జరిగింది. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించింది మా ప్రభుత్వం, ఇవన్నీ చూసి ఓర్వలేక ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారు. కాబట్టి ఇకనైనా మీరు అసభ్యకరమైన పదాలు వాడితే చూస్తూ ఊరుకోము అస్మత్ జాగ్రత్త అని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు సాదు యాదవ్, ఓబీసీ అధ్యక్షులు కుమార్ యాదవ్, పిట్ల శ్రీనివాస్ ,అచ్చునాయక్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు



## బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆకుల సతీష్ & టీం

కుత్బుల్లాపూర్ జులై20 (వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆకుల సతీష్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో వివిధ కాలనీలలో అమ్మవారి గుడులను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా, సుఖంగా ఉండాలని, రాష్ట్రానికి సమృద్ధి మరియు శాంతి చేకూరాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రంలో వరుస వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో ప్రజల క్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ పూజల్లో అనేక కాలనీల ప్రజలు పాల్గొని మాకు మద్దతుగా నిలిచారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్తో పాటు,నల్ల జై శంకర్ గౌడ్, పులి బలరాం, చందు, లానా, ముఖేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు మహిళలు, యువత కూడా స్వచ్ఛందంగా పాల్గొని పండుగ వేడుకలను వైభవంగా జరిపారు.



## నాచారంలో ఆషాడ బోనాల జాతర

నాచారం జూలై 20 (వాయిస్ టుడే): ఆషాడ బోనాల జాతరను పురస్కరించుకొని నాచారం డివిజన్ పరిధిలోని పలు ఆలయాఆలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ వీరితో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి,డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్,రాజి రెడ్డి,గంధమల్ల గోపి, మొర నర్సింహా రెడ్డి మరియు ఇతర నాయకులు ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా అమ్మవారి బోనాలు

మేడ్చల్ ప్రతినిధి ( వాయిస్ టుడే ) జూలై 20:ః జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతంలోని బాలాజీ నగర్ ప్రధాన మహాకాళి దేవాలయంలో అంగరంగ వైభవంగా పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ తరతరాల నుండి సాంప్రదాయంగా వస్తున్న ఆషాడ మాసం అమ్మవారి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ప్రజలందరికీ శుభప్రదం అని అన్నారు కోరి కొలిచే భక్తుల కొంగుబంగారమై ఆయురారోగ్య ఐశ్వర్య సుఖశాంతులతో పాటు సకల శుభాలను ప్రసాదించే అమ్మవారి ఆశీస్సులు జవహర్ నగర్ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని తెలిపారు అదేవిధంగా జవహర్ నగర్ ప్రాంతంలో గల 72 కాలనీలలో గల భక్తులందరూ దేవాలయాల వద్ద బోనాల ఉత్సవాలను పండుగ వాతావరణం లో అంగరంగ వైభవంగా అమ్మవారి బోన నైవేద్యాలతో పాటు చీర సారెలు సమర్పించి అమ్మవారి మొక్కులు నెరవేర్చుకున్నారు



## వైష్ణవ సేవా సమాఖ్య ప్రమాణ స్వీకరోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో వైష్ణవ సేవా సమాఖ్య ప్రమాణ స్వీకరోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యేబీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## తార్నాకలో ఘనంగా బోనాల వేడుకలు



సికింద్రాబాద్, జులై 20 (వాయిస్ టుడే ప్రతినిధి): తార్నాక మున్సిఫల్ డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం ఆషాడమాసం బోనాల జాతర వేడుకలు అంగరంగవైభంగా జరిగాయి. తార్నాక, లాలాపేట, మాణికేశ్వర్నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. -మాణికేశ్వర్ నగర్లోని సెవెన్ టెంపుల్స్లో జరిగిన బోనాల వేడుకల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు బోదాసు నరసింహతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. నల్లపోచమ్మ దేవాలయంలో, మాణికేశ్వర్నగర్లోని ఏడుగుళ్ల దేవాలయంలో జరిగిన బోనాల పండుగలో మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సెవెన్ టెంపుల్స్ చైర్మెన్ గండికోట విజయకుమార్ తదితరులున్నారు.



## బోరబండ అంటే బోనాలు: విజయ్ శాంతి

జూబ్లీహిల్స్ 20 జులై (వాయిస్ టుడే): ఆషాడ మాసం బోనాలు పండుగ సందర్భంగా ఆదివారం రోజు మాజీ డిప్యూటీ మేయర్ బోరబండ కార్పొరేటర్ బాబా ఫస్యుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల సంబరాలు కు ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన ఎమ్మెల్సీ విజయశాంతి హాజరై బోరబండ వినాయక్ నగర్ లో గల శ్రీ పోచమ్మ దేవాలయంలో బోనం సమర్పించడం జరిగింది.. ముఖ్య అతిథిలుగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. మరియు ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్.. కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ రహమత్ నగర్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్‌లోనీ పోచమ్మ,ఎల్లమ్మ ఆలయాలను సందర్శించి పట్టు వస్త్రాలు సమర్పించిన వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్



ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పోచమ్మ అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన నార్సింగి మార్కెట్ డైరెక్టర్ లక్ష్మి శ్రీ..



## బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్ పూర్: ఆషాడమాసం బోనాల పండుగను పురస్కరించుకొని ఆదివారం అమీన్ పూర్ మున్సిపల్ పరిధి లోని ఆయా కాలనీలలో గల అమ్మ వారి దేవాలయాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మ వారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్ని దేవాలయాల వద్ద బోనాల పండగ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆషాఢమాస అమ్మవారి బోనాల ప్రత్యేక పూజలో పాల్గొన్న పృథ్వీరాజ్



పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఎమ్.ఐ.జి లో పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో అలాగే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్ నగర్ కెసిఆర్ నగర్ లోని డబుల్ బెడ్ రూమ్ లు పొందిన ప్రజలు మొదటిసారి బోనాల పండుగను ప్రభుత్వం కేటాయించిన కెసిఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్లలో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. బోనాల సమర్పణ సందర్భంగా పృథ్వీరాజ్ ని ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉత్సవాలలో పాల్గొన్నందుకు శాలువ కప్పి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పటాన్చెరు శ్రీరామ్ నగర్ కాలనీ రాజు ముదిరాజ్ బోనాల సమర్పణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారికి ప్రజల సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం డి ఆర్ యువసేన సభ్యులు కాలనీవాసులు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## బోనాలలో పాల్గొన్న కార్పొరేటర్ సిఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్ 20 జులై (వాయిస్ టుడే ): బోనాల పండుగ సందర్భంగా రహమత్ నగర్ మరియు వెంగల్ రావ్ నగర్ డివిజన్ లో ఉన్న పలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ సిఎన్ రెడ్డి . ఈ సందర్భంగా ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియచేస్తూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని, ప్రజా పాలనలో తెలంగాణ మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి అమ్మవారిని దర్శించి ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## బోరబండలో అత్యంత వైభవోపేతంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా బోనాల ఉత్సవాలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



కూకట్ పల్లి, జులై 20(వాయిస్ టుడే): తెలంగాణలో రాష్ట్ర పరిధిలో సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా తొలి పండుగ పెద్ద పండుగ బోనాలు ఆదివారం అమ్మవారి ఆలయాలన్నీ బోనాల ఉత్సవాలతో భక్తులతో కిటకిటలాడాయి. టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి బోరబండ బస్టాండ్ లోని అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో వెళ్లి విరియాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా మూసాపేట కూకట్ పల్లి ,కెపిహెచ్బి, కాలనీ ప్రగతి నగర్ యాదవ బస్తి ముస్కిపేట్ బాలానగర్ ప్రాంతాల్లోని అన్ని అమ్మవారి ఆలయాలను అయన స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం జేఎన్టీయూ రోడ్డు లోని లులు మాల్ దగ్గరలో ఉన్న పోచమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. బోనాల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో పూలమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేశారు.

## బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మాగంటి వజ్రనాథ్



జూబ్లీహిల్స్ 20 జులై (వాయిస్ టుడే): బోనాల పండుగ సందర్భంగా రహమత్ నగర్ మరియు యూసుఫ్ గూడా డివిజన్ లో ఉన్న పలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్న మాగంటి వజ్రనాథ్ ఈ సందర్భంగా ప్రజలందరికీ బోనాల పండుగ శు భాకాంక్షలు తెలియచేస్తూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని, ప్రజా పాలనలో తెలంగాణ మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని మాగంటి వజ్రనాథ్ అమ్మవారిని దర్శించి ప్రార్థించారు.ఈ కార్యక్రమం లో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా హైదరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు



హైదరాబాద్, జులై 20(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ నగరం పరిధిలోని మున్నూరు కాపు సోదర సోదరీమణులకు ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల శుభాకాంక్షలను తెలిపారు. అదేవిందంగా ఈ దూల్ పేట్ మహంకాళి అమ్మవారి ఆలయం శత జయంతి వేడుకలు, మరియు బోనాల పండుగ సందర్భంగా దేవాలయ సభ్యుల ఆహ్వానం మేరకు, దేవాలయములో పూజా కార్యక్రమమునకు హాజరై పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్ రావు మరియు వారి కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.



## ఆషాడ బోనాల పండుగ జాతర మహోత్సవంలో జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి, జులై 20(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారుల దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ బోనాల పండుగ వేడుకల్లో పాల్గొని ప్రేమ్ కుమార్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు, బండ్రెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.



## బోనాల పండుగ సందర్భంగా మణికొండలో శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి దర్శనం- రామకృష్ణారెడ్డి

రాజేంద్ర నగర్, 20 జులై (వాయిస్ టుడే) : మణికొండ మున్సిపాలిటీలో బోనాల పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో కోలాహలంగా ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కే. రామకృష్ణారెడ్డి శ్రీ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దర్శన కార్యక్రమంలో నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్ల శ్రీరాములు , మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు శ్రావణ్ కుమార్ గంగాధర్ , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఉత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాల సమర్పించారు. ఈ కార్యక్రమం భక్తిమయంగా, శోభాయమానంగా కొనసాగింది.





# రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

## భీమేశ్వర ఆలయంలో బాలలయం మండపాల నిర్మాణానికి శంకుస్థాపన

వాయిస్ టుడే ప్రతినిధి వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం ఇందులో భాగంగా భీమేశ్వర స్వామి వారి ఆలయంలో బాలాలయం నిర్మాణానికి ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ. 3.44 కోట్లతో భక్తులకు క్యూ లైన్లు, షెడ్లు, మండపం, పహరీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకి మెరుగైన సదుపాయాలు కల్పించడానికి ఆలయ విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు.

2023%-%24సంవత్సర బడ్జెట్‌లో రూ. 50 కోట్లు, 2024%-%25 బడ్జెట్‌లో మరో రూ. 100 కోట్లు రాజన్న ఆలయం మరియు పట్టణ అభివృద్ధికి కేటాయించబడినట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామన్నారు. మొదటి విడతలో రూ. 76 కోట్లతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు శాస్త్రసమ్మతంగా, శృంగేరి పీఠాధిపతుల సలహాలు మేరకు చేపట్టుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా భీమేశ్వర ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నెలరోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రూ. 35 కోట్ల విలువైన అన్నదాన సత్రం నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయని, రాజన్న ఆలయంలో రూ. 76 కోట్లతో చేపట్టబోయే ప్రధాన అభివృద్ధి పనులకూ టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇవే విధంగా వేములవాడ ఆలయ పరిసర ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి, ఆలయ అర్చకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం

## సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడపగడపకు చేరవేయాలి

## టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి



తొర్రూరు, జులై 20 వాయిస్ టుడే: తొర్రూరు మండలం సోమారం గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ దే విజయమని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయభేరి మోగించనున్నామని ధీమా వ్యక్తం చేశారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు స్థానిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఎవరు అధైర్యపడవద్దన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని, గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రైతు ఋణ మాఫీ లాంటి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ క్లస్టర్ ఇంచార్జీ రాఘవరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, సీనియర్ నాయకులు జాటోత్ నెహ్రూ నాయక్, డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు, విద్యాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చాపల బాపురెడ్డి, పెదగాని సోమయ్య, ధరావత్ రాజేష్ నాయక్, యాకూబ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రామచంద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు సహదేవ్, వీరస్వామి, గిరిధర్, అభిరామ్, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే అధికారం సాధ్యం

## బీసీలందరూ సంఘటితం కావాలి

## మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం



హనుమకొండ, వాయిస్ టుడే: ఐక్యతతోనే అధికారం సాధ్యం అని.. బీసీలందరూ చైతన్యమై ఐక్యంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని, బీసీలందరూ ఏకమైనప్పుడే ఐక్యతతోనే అధికారం, రాజ్యాధికారం సాధ్యమవుతుందని మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. జన అధికార సమితి, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి రాసిన ఓబీసీ ల పోరుబాట పుస్తక సమీక్ష కార్యక్రమానికి వినయ్ భాస్కర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా, సంఘాలకతీతంగా బీసీ ఉద్యమం ఎక్కడ జరిగినా అక్కడ వినయ్ భాస్కర్ ఉంటారని, అండగా ఉంటారని తెలిపారు. బీసీ ఉద్యమాల్లో ఎప్పుడూ ముందుంటానని తెలిపారు. నరహరి రాసిన ఓబీసీ ల పోరుబాట పుస్తకం బీసీలకు ఒక దిక్సూచిగా పనిచేస్తుంది అని అన్నారు. వ్యక్తిగతంగా బీసీ ఉద్యమాలలో పాల్గొంటూ హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ, ములుగు రోడ్డు ప్రాంతాల్లో పూలే విగ్రహ స్థాపనకు కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ అందరం కలిసి కట్టుగా పోరాడుదామని దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరిని వినయ్ భాస్కర్ శాలువా తో సత్కరించి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

భువనగిరి ( వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్ లో పాల్గొన్నారు.. ఇందిరమ్మ ఇళ్ల పురోగతి , వార్డుల్లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు.. ప్రజా ప్రభుత్వంలో ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా అమలు అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై క్షేత్రస్థాయిలో మార్నింగ్ వాక్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిని, వార్డుల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా కాలనీలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ఎక్కడికి వచ్చాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే త్వరితగతన బిల్లులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావలసిన ఇసుక పట్ల అధికారులు పర్మిషన్ ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వంలో ఎవరికి ఇల్లు రాలేదని ఈ ప్రభుత్వంలో ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగిందని, మొదటి విడతగా ఆలేరు నియోజకవర్గంలో 3500 ఇల్లు ఇవ్వటం జరిగిందన్నారు. అదేవిధంగా, ఇందిరమ్మ ఈ ప్రజాప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వటం జరిగిందన్నారు. అదే విధంగా పలు కాలనీల్లో ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు లేవని వాటిని పరిశీలించి విద్యుత్ కనెక్షన్స్ ఇవ్వాలని అధికారులకు సూచించారు.



# కాటేపల్లి టైర్ల కంపెనీని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):-బీయాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన టైర్ల కంపెనీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య సందర్శించారు. తాజాగా పలు యూట్యూబ్ సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను ఆధారంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే స్వయంగా క్షేత్రస్థాయిలో కంపెనీని పరిశీలించారు రైతులకు ఎంతవరకు ఇబ్బంది కలుగుతుందని, కంపెనీ ఏర్పాటుకు గతంలో పర్మిషన్ తీసుకున్నారా ఇప్పటి ప్రభుత్వంలో పర్మిషన్ తీసుకున్నారా అడిగి తెలుసుకున్నారు. గతంలో తీసుకున్న పర్మిషన్ పై కంపెనీ ఏర్పాటు అయితే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంపై తమపై తమ ముఖ్యమంత్రి పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.. అప్పటి గ్రామ పంచాయతీ సెక్రెటరీ సర్పంచి గ్రామసభల ద్వారా ఆ కంపెనీ ఏర్పాటు కోసం అనుమతులు ఇవ్వడంతో పాటు అన్ని ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు. కంపెనీలో అన్ని ప్రక్రియలను పరిశీలించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పొల్యూషన్ బోర్డ్ అధికారులతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఈ ప్రాంతంలో ఏర్పడిన కంపెనీల పరిమిషన్స్ పై , జరుగుతున్న కాలుష్యంపై పూర్తి విచారణ జరపాలని , ఒకవేళ ఈ కంపెనీ ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఉంటే కంపెని మూసివేయాలన్నారు.



# శ్రీవాణి నగర్ కాలనీలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవం

## కాట శ్రీనివాస్ గౌడ్‌కు ఘన స్వాగతం ప్రత్యేక పూజలతో అమ్మవారి దర్శనం

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణి నగర్ కాలనీలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాట శ్రీనివాస్ గౌడ్ నీ స్థానికులు ఘనంగా స్వాగతించి, సన్మానించారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "బోనాల పండుగ మన తెలంగాణ సంస్కృతి యొక్క ప్రతీక అని అన్నారు. భక్తుల ఆకాంక్షలు తల్లి తీర్చి, సమాజానికి శాంతి, సౌభాగ్యం ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఇంద్రేశం పిఎన్ఆర్ టౌన్ షిప్ కాలనీలో అధ్యక్ష 150 ఓట్ల మెజార్టీతో గెలిచిన గద్దె నాగరాజు యాదవ్

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్ చేరు నియోజకవర్గం పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో ఉన్న పిఎన్ఆర్ టౌన్ షిప్ కాలనీలో సుమారు 800 ఓట్లు ఉన్న ప్రాంతంలో నువ్వా నేనా అనే పోటా పోటీలో ఎన్నికలలో ముందుకు వెళ్లగా మాజీ అధ్యక్షుడు మురళి పైన 150 ఓట్ల భారీ మెజారిటీతో గలిపొందిన గద్దె నాగరాజ్ యాదవ్, అనంతరం వారు మాట్లాడుతూ పిఎన్ఆర్ టౌన్ షిప్ కాలనీ ప్రజలు నా మీద ఉన్న అభిమానంతో నమ్మకంతో భారీ మెజారిటీతో గెలిపించిన నా అన్నదమ్ములకు నా అక్క చెల్లెలకు పేరుపేరునా ధన్యవాదాలు అని అన్నారు, ఈ విజయం నా ఒక్కడివి కాదు పిఎన్ఆర్ కాలనీ వాసులది గెలుపొందిన ఆనందంలో అభిమానులు నాకు నా చిత్ర పటానికి పాలతో అభిషేకం చేయడం చాలా సంతోషకరమన్నారు, ఎన్నికలలో మేనిఫెస్టోలో పొందుపరిచిన అభివృద్ధి పనులను నిర్వహిస్తానని ఇచ్చిన మాట ప్రకారం మీకు 24 గంటలు మీతో కలిసి పని చేస్తానని అన్నారు, సంవత్సరంలో కులాల కు అతీతంగా వచ్చే పండుగలను మనందరం కలిసి అన్నదమ్ముల వలె సెలబ్రేషన్ చేసుకోవాలని అన్నారు... ఈ కార్యక్రమంలోమున్నూరు రవి, విక్రమ్, శ్రీనివాస్, గోపాల్ యాదవ్, రాము, సంతోషరెడ్డి, పవన్, వెంకటేష్,బుంరెడ్డి, అనిల్ గౌడ్,రాజు, కమిటీ సభ్యులు,పిఎన్ఆర్ కాలనీవాసులు మరియు తదితరులు పాల్గొన్నారు



# ఆషాఢ మాస బోనాల సందర్భంగా వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న పృథ్వీరాజ్

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్ మండలం లింగమయ్య కాలనీ, రామచంద్రపురంలోని కాచిరెడ్డిపల్లి, శ్రీనివాస్ నగర్ కాలనీ, ఇంద్రేశం ఆర్ కె నగర్ కాలనీలలో ఆషాడ మాసం బోనాల ఉత్సవాలలో స్థానిక యువత, గుడి నిర్వహకులతో కలిసి పృథ్వీరాజ్ పాల్గొనడం జరిగింది. రామచంద్రపురం శ్రీనివాస్ నగర్ కాలనీలో సాయిచరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి బోనాల ఉత్సవాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించాలి

## మాజీ మున్సిపల్ చైర్మన్, జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ఆగస్టు 3 ,4 న జె ఎన్ స్టేడియం హనుమకొండలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి పురుషుల, మహిళల, అండర్ -20, 18,16, 14 బాల బాలికల సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో పాల్గొను యాదాద్రి భువనగిరి జిల్లా ఎంపికలు ఆదివారంరోజు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల( బాలురు) భువనగిరి మైదానంలో ఉదయం జిల్లా అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఇట్టిపోటీలను జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను జెండాఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ఎంపికకాబడిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు. ఇట్టి పోటీలలో జిల్లా నలుమూలల నుండి 150 మంది క్రీడాకారులు హాజరయ్యి పోటీల్లో పాల్గొన్నారు. తదుపరి బాలబాలికలకు వేరువేరుగా 100,200,400,600, 800,1000 1500,5000 మీటర్లు , లాంగ్ జంప్, షాట్ పుట్ నందు బాల బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్స్ ను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి ఎంపిక కాబడిన అథ్లెట్స్ ఒరిజినల్ వయస్సు ధ్రువీకరణ పత్రం విధిగా సమర్పించవలెను స్వంతంగా రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకావాలి. భోజన, రూమ్ వసతులు కల్పించబడవు (పూర్తిగా వ్యక్తిగతగా చూసుకోవాలి) పోటీలు ( ఆగస్టు 3, 4న) జరిగే రోజు ఉదయం 6గం. కి జేఎన్ స్టేడియం హనుమకొండ లో రిపోర్ట్ చేయాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్ తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి వినోద్, వెంకటరమణ, సాంకేతిక అధికారులు రఘువీర్ సింగ్, సునీల్, మల్లేష్, సాయి మల్లికార్జున్, నవీన్, గణేష్ అచ్యుత్, కరుణాకర్, అనిత, అజయ్ కుమార్, గణేష్, కౌశిక్, గురునాధ్, నిఖిల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి పాలనకు పతనం మొదలైంది అయింది

**420 హామీలను అమలు చేసే దమ్ములేకనే కేసీఆర్‌పై నోరుపారేసుకుంటున్నారు**

**స్థానిక సంస్థ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం**

**రిజర్వేషన్ల పేరుతో బిసిలను మోసంచేస్తున్న ప్రభుత్వం**

**పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనకు పతనం మొదలైందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా పరకాల నియోజవర్గం గీసుకొండ మండలం ఊకల్ క్రాస్ సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్స్ లో గీసుగొండ మరియు సంగెం మండలాల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటుచేసిన విస్తృతస్థాయి సమావేశానికి చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజం ఏవగించుకుంటున్నా సీఎం రేవంత్‌రెడ్డి తీరు మారలేదని మండిపడ్డారు. తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలబెట్టారని అన్నారు. తన చేతకానీ పాలనలో చెప్పుకోవడానికి ఒక్క మంచి పని లేక దిక్కుతోచని సీఎం రేవంత్ రెడ్డి నోటి దురదతో తెలంగాణ ఆత్మగౌరవానికి మచ్చ తెస్తున్నారని ధర్మారెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రవర్తన సీఎం కుర్చీకే తీరని కళంకం అని, కేసీఆర్ ను ఆయన కుటుంబాన్ని తిట్టందే రేవంత్‌కు పూట గడవదని.. కేసీఆర్ స్మరణ లేకుండా రేవంత్ రెడ్డికి నిద్ర కూడా పట్టదని ఎద్దేవాచేశారు.

ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేసే దమ్ము లేకనే కేసీఆర్‌పై అక్కసుతో రేవంత్‌రెడ్డి నిత్యం నోరు పారేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రశ్నించే వారిపై బూటకపు కేసులు, అక్రమ నిర్బంధాలు అమలు అమలుచేస్తున్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓడిపోతామనే ఎన్నికలు నిర్వహించడం లేదని ధర్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలైన రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు బోనస్ ఏమైందని, రైతులకు బీమా సౌకర్యం కూడా కల్పించడం లేదని.. పింఛన్ రూ. 4వేలకు పెంపు, ఆడబిడ్డలకు స్కూటీలు, మహిళలకు రూ.2,500 హామీలు ఎటుపోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభత్వం 18 నెలల కాలంలో 700 రైతులు ఆత్మహత్యలు చేసుకొని మృతిచెందారని, రైతుల ఉసురు రేవంత్ రెడ్డి కి తాకుతుందన్నారు. వీటన్నింటినీ ప్రజలు మర్చిపోవాలని బీసీ రిజర్వేషన్ అంశాన్ని పెద్దగా చేసి డ్రామాలు ఆడుతున్నారని, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలను విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సంగెం మరియు గీసుగొండ మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే నిర్వాకంతో రైతులకు నష్టం

## పంటలకు సాగునీరు అందించాలి

తొర్రూరు, జులై 20 వాయిస్ టుడే : స్థానిక ఎమ్మెల్యే నిర్వాకంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీతారాములు, శ్రీనివాస్ మాట్లాడుతూ. రైతులు నాట్లు వేసుకుంటున్న తరుణంలో సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, సరైన సమయంలో నీరు విడుదల చేయకపోవడం వల్ల రైతులు గోసపడుతున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఎస్సారెస్పీ డిబీఎం 57, 59 , 60 కాలువల ద్వారా నీరు అందించాల్సి ఉన్నా కాలయాపన చేయడం దారుణమన్నారు. రైతులకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి దయాకర్ రావు పాదయాత్ర చేసేవరకు ఎమ్మెల్యేకు ఉలుకు, పలుకు లేదన్నారు. అధికారులతో హడావుడిగా సమీక్షలు జరిపిన ఎమ్మెల్యే ఇంతవరకు ఎందుకు నీరు విడుదల చేయలేదని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే అనుభవ రాహిత్యంతో వ్యవహరిస్తుందని, వ్యవసాయం, రైతు సంక్షేమంపై వారికి అవగాహన లేదన్నారు.దయాకర్ రావు మంత్రిగా ఉన్న సమయంలో సాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాడని, అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి కాలువలకు నీరు వచ్చేలా నిరంతర కృషి చేశాడని గుర్తు చేశారు. మూడు రోజుల్లో ఎస్సారెస్పీ కాలువలకు నీరు వదలక పోతే నిరసన ప్రదర్శనలు, పొలాల వెంట పాదయాత్రలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో తొర్రూరు పట్టణ పార్టీ అధ్యక్షులు బిందు శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నలమోస ప్రమోద్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్యామకూరి ఐలయ్య, కాలు నాయక్, ప్యాక్స్ డైరెక్టర్ జనార్దన్ రాజు, రాయిశెట్టి వెంకన్న, లేగల వెంకటరెడ్డి, పులి వెంకన్న, జాటోత్ స్వామి, చక్కిలేల మణిరాజ్, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, పులి సోమలింగం, పెద్ద బోయిన రామ్మూర్తి యాదవ్, మంగళంపల్లి ఆశయ్య, నిమ్మల శేఖర్, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు యర్రం రాజు, గడ్డం శివమణి తదితరులు పాల్గొన్నారు.

# కలంతో ప్రజా సమస్యల గళం విప్పే పాత్రికేయ మిత్రులు యోధులతో సమానం : భూపాల్ నాయక్





**ముక్యంగా ఈ సమ్మేళనం నా కుటుంబ సభ్యులైన మా పాత్రికేయులతో**

**డోర్నకల్ ప్రాంత రైతుల సంక్షేమమే మా కిసాన్ పరివార్ లక్ష్యం**

**రైతులతో పాటు నిరుద్యోగ యువతకు కూడా చేయూత ఇవ్వటమే నా జీవిత లక్ష్యం**

**నేను ఒక రైతు బిడ్డనే గంజి నుంచి ఈరోజు బెంజ్ వరకు రావటానికి దోహదపడింది నా ఆలోచన విధానమే**

**రైతు రాయల్‌గా ఉండాలి, రైతే రాజు కావాలి అనే సంకేతంగా మా సభ్యులకు రాయల్ ఎన్ఫీల్డ్ పంపిణి**

**పేద పిల్లల భవిష్యత్తు కోసం బ్యాంక్ లో ఎఫ్ డి తో వారికి చేయూత**

**దేశానికి అన్నం పెట్టే రైతన్న అనాదగా రాజకీయ నాయకుల చేతిలో అన్యాయానికి గురవుతున్నాడు**

**ప్రతీ ఒక్కరికి కనీస అవసరాలు విద్య, వైద్యం, ఉపాధి నా జీవిత ఆశయం**

(మహబూబాబాద్:20/07/25 వాయిస్ టుడే న్యూస్) ఈరోజు కురవి మండలం సూదనపల్లి గ్రామంలో గల కిసాన్ పరివార్ సొంత వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన పాత్రికేయ మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కిసాన్ పరివార్ వ్యవస్థాపక అధ్యక్షులు నానవత్ భూపాల్ నాయక్. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై తమ కలంతో గళం విప్పే పాత్రికేయ మిత్రులు వృత్తి ధర్మంలో భాగంగా తమ ప్రాణాలతో పాటు కుటుంబాన్ని కూడా లెక్కచేయకుండా తమకు సమాచారం తెలిసిందే తడవుగా అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే సందర్భంలో ఏమైనా జరగరాని ప్రమాదం జరిగినప్పుడు రక్షణగా హెల్మెట్ అందించడంతోపాటు జిల్లాలోని ప్రతి జర్నలిస్టుకు 10 లక్షల ప్రమాద బీమా అందేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే దేశానికి అన్నం పెట్టే రైతన్న అనాదగా రాజకీయ నాయకుల చేతిలో అన్యాయానికి గురవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరికి కనీస అవసరాలైన విద్య, వైద్యం,ఉపాధి ఈ మూడు డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు అందించటమే నా జీవిత ఆశయం అని తెలిపారు.

నేను ఒక రైతు బిడ్డనే గంజి నుంచి ఈరోజు బెంజ్ వరకు రావటానికి దోహదపడింది నా ఆలోచన విధానం,కష్టం మాత్రమే. ప్రతీ రైతు పండించిన పంటకు కనీస మద్దత్తు ధర కల్పించి వారికి సరైన మార్కెటింగ్ విధానం నేర్పిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు నడిపించే విధంగా కిసాన్ పరివార్ కృషి చేస్తుంది.

ముక్యంగా మా కిసాన్ పరివార్ మండల కో ఆర్డినేటర్లకు రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ ఇవ్వటానికి ప్రధాన కారణం రైతు రాజులాగ రాయల్ గా బ్రతకాలని ప్రతీ ఒక్కరు కిసాన్ పరివార్ లో భాగస్వామ్యం అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువతకు తన కంపెనీ లో ఉద్యోగ అవకాశం కల్పించటంతో పాటు పలువురు విద్యార్థులకు తన సొంత నిధులతో ఫిక్స్డ్ డిపాజిట్ చేయించి వారి భవిష్యత్తు కు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు మరియు జిల్లాలోని అన్ని మండలాల జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

# జిల్లాలో క్రీడా పాఠశాల ఏర్పాటుచేయాలి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేల బృందం**

**దేవన్నపేట శివారు సర్వే నెం 325లో 30ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి**

**వెంటనే విధివిధానాలు రూపొందించాలని అధికారులకు ఆదేశం**

**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు**



ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి అంతర్జాతీయ, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి క్రీడలలో ప్రాతినిధ్యం వహించిన అనేక మంది క్రీడా దిగ్గజాలు ఉన్నారని, వారిలో చాలా మందికి కేంద్ర ప్రభుత్వం నుండి అర్జున, ద్రోణాచార్య అవార్డులు కూడా లభించాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు వెల్లడించారు. అందుకే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థులు, యువత క్రీడల్లో ఇంకా రాణించాలంటే జిల్లాలో క్రీడా పాఠశాల, ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కే.ఆర్ నాగరాజు తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సీఎం తో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలను స్థాపించడం ద్వారా రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి మరియు క్రీడలను ప్రోత్సహించడానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఒక్కటే ఉందని.. ఇందులో జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడలు మరియు ఆటలకు సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ స్టేడియం రాష్ట్ర మరియు జిల్లా స్థాయి విద్యార్థులు, ప్రాంతీయ క్రీడాకారులు వారి సాధారణ శిక్షణ కోసం ఉపయోగించబడుతుందని తెలిపారు. ప్రస్తుతం వరంగల్ మహా నగరం అన్ని వైపులా విస్తరిస్తూ జనాభా పెరుగుతుంది కావున ప్రస్తుత స్టేడియం క్రీడాకారుల అవసరాలను తీర్చలేక పోతుందని వివరించారు. అందుకోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ క్రీడా పాఠశాలను మంజూరు చేయవలసిన అవసరం ఉందని ఇది విద్యా అభ్యాసం, ప్రత్యేక క్రీడా శిక్షణలు, రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, అథ్లెట్లపై దృష్టి పెడుతుందని కోరారు.

**క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు విజ్ఞప్తి..**

క్రీడా పాఠశాల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ (%ఖఖణూ%) భూమి ధర్మసాగర్ మండలం ఉన్నికిచెర్ల గ్రామంలోని సర్వే నెం. 325లో 20 ఎకరాల భూమి జాతీయ రహదారి 163కి అనుకోని నగరానికి దగ్గరగా అందుబాటులో ఉందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ రెండవ అతిపెద్ద నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వరంగల్ ఉత్తర తెలంగాణలో ఒక విద్యా కేంద్రంగా ఉందని, ఇక్కడ నిట్ (%చీ×ు%), కాకతీయ విశ్వవిద్యాలయం, డాక్టర్ కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 3 మెడికల్ కాలేజీలు మరియు ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు వంటి అనేక విద్యా సంస్థలు ఉన్నాయని తెలిపారు. క్రీడా రంగంలో క్రికెట్ అత్యంత ప్రాముఖ్యత క్రీడ కావడంతో చాలా మంది యువత మరియు విద్యార్థులు క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతున్నారని మీకు తెలుసనని.. అందువల్ల వరంగల్‌లో ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలనీ యువత మరియు విద్యార్థుల నుండి డిమాండ్ ఉందని తెలిపారు. వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడానికి మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారాని, అందులో భాగంగానే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, ఇన్నర్ రింగ్ రోడ్, ఓఆర్ఆర్, మెగా టెక్స్టైల్ పార్క్ మొదలైన వాటికి భారీ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే వరంగల్ నగరంలో ప్రత్యేక క్రికెట్ స్టేడియం మంజూరు చేస్తే వరంగల్ మహా నగరానికి మనిహారంగా మారుతుందని కోరారు. కావున వరంగల్ నగరానికి తెలంగాణ క్రీడా పాఠశాల మరియు ప్రత్యేక క్రికెట్ స్టేడియంను వీలైనంత తొందరగా మంజూరు చేయాలనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలోని ఎమ్మెల్యేల బృందం చేసిన విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత శాఖ సెక్రెటరీకి ఫోన్ చేసి వరంగల్ నగరంలో తెలంగాణ క్రీడా పాఠశాల మరియు క్రికెట్ స్టేడియం ఏర్పాటు ప్రత్తిపాదనలు పరిశీలించి అందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ నగరాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేసేందుకు నా వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, అతి త్వరలో క్రీడా పాఠశాల మరియు క్రికెట్ స్టేడియం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇందుకు ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.